1846 ఆగష్టు 22న విలియం జాన్‌థామస్ అనే ఆంగ్లేయుడు ఆంబ్రోస్ మర్టన్ అనే కలం పేరుతో 'ది అథీనకమ్' అనే పత్రికలో తొలిసారిగా Folk lore అనే పదాన్ని సూచించారు. సుమారు 162 సంవత్సరాల క్రితంనాటి మాట జానపద పరిశోధనకు మూలమయ్యింది. జనపదం, జానపదం అనే పదాలు మన సాహిత్యంలో భిన్నార్థాలలో ప్రయోగించారు. కవులను బట్టి ఆయా కాలాదులను బట్టి జన, జాన పదాలలోని హ్రస్వ దీర్ఘాల ననుసరించి తొలి మలి రూపాలుగా నిర్ధారించవచ్చు. 'భవేజ్జనపదో జానపదోపి జనదేశయోః' అని విశ్వనిఘంటువు (ఓగేటి అచ్యుత రామశాస్త్రి) తెలియజేస్తుంది. జనులకు, దేశానికి ఈ రెండు పదాలను ప్రయోగించారన్న విషయం విదితమవుతుంది. 'ఉపస్తువంతి దేవం పౌర జానపదాః' అని భవభూతి ఉత్తరామ చరిత్ర నాటకంలో పేర్కొన్నారు. పురవాసులు గ్రామవాసులనే భావంతో ప్రయోగించాడు. మన నిఘంటువులు జానపదము అనే పదానికి మండలము, దేశము, పల్లెటూరు (ఆంధ్ర వాచస్పత్యము -1938) అని, జనులుండు తావు, గ్రామము, పల్లె (నానార్థ రత్నమాల) అని, దేశము (కేశవమిశ్రుని నానార్థార్ణవ సంక్షేప నిఘంటువు) అని, దేశము, గ్రామము, జనులుండు చోటు (శబ్దార్థదీపిక 1956) అని వివరిస్తున్నాయి. నాలుగవ శతాబ్దానికి చెందిన చాణక్యుడు జనపదమంటే గ్రామమని, కులమంటే కుటుంబమనే అర్థంలో ప్రయోగించాడు. కాళిదాసు మేఘసందేశంలో జనపదం అనే పదానికి పల్లె, దేశమనే అర్థాలలో ప్రయోగించాడు. ప్రీతి స్నిగ్ధైర్జనపద వధూలోచనైః (జనపద = పల్లె), బ్రహ్మావర్తం జనపదమథచ్ఛాయయా (జనపదం = దేశం) అని తెలియజేస్తున్నాయి.

ప్రపంచ జానపద దినోత్సవంగా 22 ఆగష్టున జరుపుకోవటం విశేషం. మదర్స్ డే, ఫాదర్స్ డే, ఫ్రెండ్‌షిప్ డే అని మానవ సంబంధాలు వ్యాపార సంబంధాలవుతున్న రోజులలో మన సంప్రదాయాన్ని మన సంస్కృతిని కాపాడుకునే లక్ష్యంతో నేడు విశ్వవిద్యాలాయాలు, పరిషత్తులు ముందుకొచ్చి కళలను ప్రోత్సహిస్తున్నాయి.

జానపద ప్రదర్శన కళలు నాడు-నేడు అనేది ప్రస్తుతాంశం. జానపదులంటే సామాజిక సముదాయమని, ప్రకృతిని ఆరాధించేవారని, నాగరిక ప్రభావానికి దూరమైన వారని, ఎక్కడున్నా సంప్రదాయాన్ని కాపాడే సామాజిక సముదాయమని, మానవ సంఘ సంస్కృతే జానపద విజ్ఞానమని పలువురు పలు అభిప్రాయాలను వ్యక్తం చేసారు. మారే కాలంతో పాటు కొన్ని నిర్వచనాలు మారుతూ వచ్చాయి. ఎక్కడున్నా సంప్రదాయాన్ని కాపాడే సామాజిక సముదాయమే జానపదులు. జానపదులు ప్రదర్శించే జానపద కళలు మన సంస్కృతికి పుట్టినిల్లు. జానపద కళారూపాలు సామాజిక స్వరూపాన్ని ప్రతిబింబిస్తాయి. వినోదాన్ని విజ్ఞానాన్ని కలిగించే ఈ రూపాలు కులాచారాలను, మతాచారాలను, సంప్రదాయాలను, కట్టుబాట్లను, ఆచార వ్యవహారాలను విశ్వాసాలను తెలియజేస్తాయి. జానపద కళల ప్రదర్శనలో జాతి జీవనం, జాతిలో జాగృతి, అస్తిత్వపోరాటం కనిపిస్తుంది. జానపద విజ్ఞానం 'మానవ సంస్కృతికి మూలం'. మానవ జాతి పరిణామ క్రమాన్ని గమనిస్తే అందులో అధిక భాగం ఆదిమ దశనుంచి పైకి పెరగటానికి సరిపోతుంది. యంత్ర యుగం నుంచి ఈనాటి వరకు వచ్చిన అభివృద్ధి పదోవంతు ఉండదు. నేటి నాగరికతకు ఆనాటి సంస్కృతి పునాది.

మారుతున్న సామాజిక స్థితిలో జానపద ప్రదర్శన కళ - చిందు భాగవతం - కళాకారుల జీవితం :

చిందు భాగవతాన్ని ప్రదర్శించే కళాకారులను చిందోళ్ళు, సిందోళ్ళు అని వ్యవహరిస్తున్నారు. వీరు మాదిగ ఆశ్రిత కులాలవారు. మాదిగలను ఆట పాటలతో వినోదింపజేస్తూ యాచించేవారు. సంచార జీవనం చేస్తూ భిక్షుక వృత్తి కలిగి కళారూపాలను ప్రదర్శించేవారు. ఆంధ్రప్రదేశ్ పభుత్వం వీరిని షెడ్యూలు కులాలుగా గుర్తించింది. తెలంగాణలోని అన్ని జిల్లాలలో (నిజామాబాదు, వరంగల్, నల్గొండ, మెహబూబ్‌నగర్, మెదక్, అదిలాబాదు, కరీంనగర్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాదు) ఈ కులాలవారు ఉన్నారు. చిందు ప్రదర్శన కళ ఆహార్యాభినయాది ప్రదర్శనల్లో యక్షగానంలా ఉండటం వలన ఈ కళను చిందు యక్షగానమని అన్నారు.

చిందు భాగోతానికి పేరు రావాలని చిందు యక్షగానం అని అన్నారు. భాగోతం అన్నా యక్షగానం అన్నా రెండూ ఒకటే. తేడా ఏమీ లేదు. దరువులను అనుకూలంగా మార్చుకుంటారు.

(– నేను చిందుల ఎల్లమ్మను. డా. కె.ముత్యం)

ఎటునుండి ఎటు సంక్రమించినా చిందు నృత్యం ప్రధానంగా జానపదులదే. ఆ చిందుల్లోని వైవిధ్యమే యక్షగానంలోని అడుగుల్లో కనిపిస్తుంది. ఈ చిందులే యక్షగానంలోని జానపదత్వం.

(ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి – యక్షగానం జానపద రూపకం)

చిందు మాదిగలు ఆడేఆట చిందు భాగవతం. చిందు భాగవతం ఆడేవారిని చిందు భాగవతులు అని, పగటివేళ ఎక్కువగా ప్రదర్శనలిచ్చేవారు కాబట్టి పగటి భాగోతం, పగటి వేషాలు అని వ్యవహరించారు.

పాటల బాణీలు, దరువులు యక్షగానాన్ని పోలి ఉంటాయి. ఒకరకమైన అడుగుల విన్యాసాన్ని నృత్య విశేషాన్ని ప్రదర్శించటం వలన వీరిని చిందుల వాళ్ళని వ్యవహరించారు. మాదిగలను ఆశ్రయించి జీవించే వారు కాబట్టి చిందు మాదిగలని అన్నారు. వీరు ఊర్వశి వారసులని, భోగం మాదిగలని, మాదిగ ఆశ్రితులని వ్యవహరిస్తారు. సైరంధ్రి పదంనుండి సింధు, సిందోళ్ళు అనేపదాలు వచ్చాయని అంటారు.

చిందు పదస్వరూపం :

చిందు అనే పదానికి చిందు లేయటం, చిందు తొక్కటం అనే పర్యాయ పదాలు కనిపిస్తాయి. ఇది అభివ్యక్తి మార్గంగాను సూచింపబడింది. కోప భావ ప్రకటనకి, భావస్ఫోరకానికి, expression outlet కి కూడ అన్వయమవుతుంది. లయబద్ధమైన అడుగుల విన్యాసానికి 'చిందు' పదాన్ని ప్రయోగించారు, తమిళంలో సింద్ (ప్రత్యయం చేరని రూపం) అనే పదానికి ఒలుకుట అనే అర్థం ఉంది. భావ ప్రవాహం, పద విన్యాసం, పాద విన్యాసం అనే అర్థాలలో ప్రయోగించారు.

నిఘంటు అర్థాలు :

చిందు – ఒలుకు, ఒక నాట్యం, బిందువు, అలక, ఆగ్రహం, ఒకరకం పాట (శబ్దరత్నాకరం).

విశేషణం – పడిన, క్రియ – ఒలుకు, రాలు, పోవు , వ్యాపించు, వ్యయం, ప్రసరించు

ఉదా: మాతంగ నాట్యనామంబగు చిందు (ఆంధ్ర భాషార్ణవము నిఘంటువు, నుదురుపాటి వేంకనార్యుడు)

ఉదా: ఒడలుబ్బ నిక్కి ముందటి యడుగులు ధరనూది చిందు నలబలమునకున్ (మనుచరిత్ర, 4,53)

ఉదా: గీతంబు, దరువు, జక్కిణి, చిందు మొదలుగా ఒక్కొక్క వర్ణంబు నుగ్గడించి – (సూర్యరాయాంధ్ర నిఘంటువు)

చిందు భాగోతం నిర్వచనం :

భావ ప్రకటనతో ఒడలు తూలినట్లుగా వేసే అడుగులతో సంగీత వర్ణ విశేషంతో (రాగం, తాళం, దరువు) చేసే ఒక నాట్యకళారూపం.

జనాభా : నూటికి 20 శాతం

ప్రాంతం : అదిలాబాదు, నిజామాబాదు, కరీంనగర్, మెహబూబ్‌నగర్, వరంగల్, మెదక్, ఖమ్మం, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాదు.

చారిత్రక నేపథ్యం : చిందు అనేది ఒక కాలంలో సంబరం, వేడుక, పండగలా జరిగేది. ఇది హావ భావాల వ్యక్తీకరణ. పంటలు ఇంటికి వచ్చే సమయంలో పంటపండించిన వారంతా కోతలు సమయంలో ఆడుతూ పాడుతూ చేసుకునే పండుగ. వ్యవసాయ సంబంధమున్న ఈ కులం క్రమేపి భూములకు దూరమై పశువుల్ని మేపుతూ అంటరాని వారుగా నిలిచారు. ప్రతి ఏడాది జరిగే సంబరంగా చిందు కళారూపం ప్రదర్శన కళగా ఒక హక్కుగా

ఏర్పడింది. సంబరంగా పండుగగా ఉన్న చిందు సమ్మతి రూపం నుండి అసమ్మతి రూపాన్ని సంతరించుకుని ఉంటుంది. వీరికి జీవనాధారమైన భూమికి, నాగలికి, గేదెలకి దూరమై వీటిని సొంతం చేసుకున్న వారిపై తిరుగుబాటుగా ఏర్పడిన కళారూపమే చిందుకళ. ఊరి మధ్యలో తమ కుల పురాణాన్ని మాదిగల వినోదార్థం ముందుగా ప్రదర్శించి ఆపైన మిగిలిన కులాల వారిముందు ప్రదర్శించి వారిని ఆశ్రయించి జీవనం సాగిస్తారు. మాదిగ ఆశ్రిత కులాల ప్రదర్శన కళగా, చిందు భాగవత కళగా తలెత్తి జాతిలో జాగృతిని, చైతన్యాన్ని, కుల ఆధిక్యతని కలిగించటమే ఈకళ లక్ష్యంగా కలిగిఉంది. ఉత్పత్తి సంబంధం వలన పరస్పరం ఆధారపడి ఉండటం వలన వీరు ప్రదర్శించే అసమ్మతిని, వీరు చేసే విమర్శలను ఇతర కులాల వారు ఎదుర్కొనక తప్పలేదు. కుల భావజాలాన్ని నిరంతరం చెప్పటానికి ఉపయుక్తమయ్యే ప్రచార సాధనం చిందు కళారూపం. ఆంధ్రప్రదేశ్‌లో 150 జానపద కళలు ప్రసిద్ధమైనవి. అందులో చిందు భాగవతం ఒకటి. ఇది సంగీత సాహిత్య నృత్య కళారూపం.

చిందు ప్రదర్శన నియమాలు :

కులకట్టుబాటు ననుసరించి చిందువాళ్ళు దాతృకులాలను (మాదిగలను) ఆశ్రయించి మూడు లేదా రెండు భాగోతాలను ప్రదర్శించిన తరువాత జాంబపురాణం చెప్పి తీరాలన్నది కట్టడి.

ప్రదర్శన కాలం : సంవత్సరంలో ఎనిమిది నెలలు చిందు భాగోతం ఆడతారు. రాత్రి తొమ్మిది గంటలకు మొదలైతే తెల్ల వారు వరకు ప్రదర్శిస్తారు. పొద్దున్న పదిగంటలకు ప్రారంభమయితే సాయంత్రం 6,7 గంటల వరకు ప్రదర్శిస్తారు.

వస్తువు : ఎల్లమ్మకథ, చెంచు భాగోతం, సారంగధర, సుగ్రీవ విజయం, సతీసావిత్రి, సుందరకాండ, కృష్ణ భాగోతం, ప్రహ్లాద చరిత్ర, మైరావణ, మాంధాత చరిత్ర, రామాంజనేయ, సతీ అనసూయ, వీరాభిమన్య మొదలైన పౌరాణిక ఇతివృత్తాలు ప్రదర్శనీయాలు. మధ్య మధ్య ప్రజల సమస్యలను సందర్భోచితంగా చొప్పిస్తూ సామాజిక ప్రయోజనాన్ని ఆశించే కళగా జానపదకళలు ప్రదర్శింపబడుతున్నాయి.

పాత్రలు : కుటుంబ సభ్యులే కళాకారులు. ఉమ్మడి కుటుంబాలుగా ఉండి బృందాలుగా ఏర్పడతారు. ఈ బృందాలని మేళాలని అంటారు. సుమారు యాభై మేళాలు / దళాలు చిందు నృత్యాన్ని ప్రదర్శించేవారు నిజామాబాదు జిల్లాలో ఉన్నారు.

వాయిద్యాలు : తబలా, హార్మోనియం, తాళం, గజ్జెలు, పుంగి (ఆనపకాయ వాయిద్యం పూర్వం ఉండేది), డప్పు

తాళం : ఆట, ఆది, రూపక తాళాలు ప్రసిద్ధమైనవి. గతి ప్రధానాలైన దరువులు ఉంటాయి. పాటగతికి ప్రాధాన్యమిచ్చి నడిచే ఆవృత్తాలు.

రాగం : భూపాలం, కాంభోజి, రూపక, మోహన, అసావేరీ రాగాలతో పాడతారు. సుత్తిగంతు, కత్తెర అడుగు, కుంగి ఒప్పెనం, చక్రాలు అడుగులు ఉంటాయి.

ఆభరణాలు : బూరుగు కట్టె కిరీటాలు, భుజకీర్తులు, సూర్యకిరీటాలు, శంఖ చక్రాలు, మకర కుండలాలు, కంఠసారె, చేతి పద్మాలు మొదలైనవి పురుషుల ఆభరణాలు. సర్పజడ, చంద్రవంక జడ, బాదం జడ, అవుతోక జడ అనే కిరీటాలతో బాటు మల్లెదండలు, గల్లపట్టి, బోడుచిక్కు, దండతాయెత్తులు, గాజులు, కంఠ హారాలు, సిగ రేకులు, సిగకుప్పె, చిక్కుతల మాడుబిళ్ళ, చంద్రవంక, పాపెడ జోడు, చెంప చిలుకలు, చెక్కుడు గొలుసు, షాంపు జడ, హంస కలువలు, నడిపి కలువలు, సాదా కలువలు, కుర్లు చిలకలు, గొడుగు మీద చిలక, మకర కుందనాలు, గున్నలు, కంఠసరి, చెక్క బవిలీలు స్త్రీలు ధరించే ఆభరణాలు. ప్రకృతి ప్రసాదించిన వస్తు సంచయాన్ని రకరకాల చెట్ల రసాలతో మేకప్ సామగ్రిని తయారు చేసుకుంటారు. వారి ఆభరణాలను వారే తయారు చేసుకుంటారు.

ప్రదర్శన రంగం : వీధి. వీధిలో ఆరుగుంజలు పాతి పచ్చటాకులతో చాందిని వేసి ముంగిట తెరకడతారు. ప్రదర్శన తరువాత ధాన్యం, వస్త్రం, దూడ, దుక్కి, పెయ్య, పడ్డ, భూమి మొదలైనవి దానంగా స్వీకరరిస్తారు.

ప్రదర్శన ఆరంభం : వినాయక సరస్వతి ప్రార్ధనలతో ఆరంభమైన ప్రదర్శన మంగళహారతితో ముగుస్తుంది.

ప్రేక్షకులు : దాతృకులాలకు ప్రదర్శించిన తరువాత అన్ని కులాల వారికి ప్రదర్శిస్తారు.

ప్రయోజనం : బ్రతుకు తెరువుగా, వృత్తి ధర్మంగా, సంప్రదాయ రక్షణగా కొనసాగిన కళలు నేడు కళాపోషణ, ప్రజా రంజకత్వం, కులప్రాశస్త్యం, సౌందర్య దృష్టి కోసం ప్రదర్శింపబడుతున్నాయి. పురాణాల ప్రదర్శన వలన అంటరానితనం తొలగిపోయే కాలం దగ్గర పడిందని విశదమవుతుంది. జాతిజీవనం, జన జాగృతి, జనచైతన్యం ప్రధాన లక్ష్యాలుగా ప్రదర్శనలు కొనసాగుతాయి.

చిందు భాగోతం కళాకారుల జీవితం – మారుతున్న సామాజిక స్థితి :

1. కాలం మారింది. ప్రజల అభిరుచులు మారాయి. నేటి ప్రయాణ సౌకర్యాలతో ప్రచార ప్రసార మాధ్యమాలలో ప్రపంచమంతా కంటిముందే ప్రత్యక్షమవుతుంటే గిరిగీసుకున్న ఎల్లలు విశ్వవ్యాప్తమయ్యాయి. వేగవంతమైన నాగరిక జీవనంలో సమయం ఒక సమస్యగా మారింది. చిందు భాగోతం సుమారు ఆరు ఏడు గంటలు పాటు కొనసాగేది. అంత సమయాన్ని వెచ్చించే అవకాశం లేకపోయింది. (దీర్ఘ)కావ్యాల స్థానంలో మినీ కవితలు, టుమ్రీలు, హైకూలు, నానీలు చోటు చేసుకున్నట్టుగా జానపద ప్రదర్శన కళల స్వరూపంలో, విస్తృతిలో కుదింపు అవసరం.
2. సినిమాలు, టీవీలు, సిటీ బతుకులు ధాటికి గ్రామకళలు నిలదొక్కుకోలేక పోతున్నాయి.
3. జానపద కళారూపాలు అత్యంత ప్రాచీనమైనవి. ఇవి పండిత పామరులను చిన్నపిల్లలను అమితంగా ఆకర్షించాయి. ప్రజా జీవనంలో జానపద కళలకున్న ప్రాముఖ్యాన్ని సాహిత్యంలో మనం గమనించవచ్చు. బుద్ధ చరిత్రలో, దానికి అనువాదమైన లైట్ ఆఫ్ ఏషియాలోనూ జానపద కళల ప్రస్తావన కనిపిస్తుంది. పండిత పామరులను ఆకర్షించిన పాములాట, దొమ్మరాట, బుట్టబొమ్మలు.... వంటి ఎన్నో కళలు పేర్కొనబడ్డాయి.
4. నేడు జానపద ప్రదర్శన కళలు ఉల్లాస కార్యక్రమాలై కులమత ప్రాంతాల ప్రమేయం లేకుండా జాతీయ స్థాయిలో ప్రదర్శింపబడుతున్నాయి. అయినా అది స్వల్పమాత్రమే. దానివలన జానపద కళలకు చెప్పుకోదగ్గ రాణింపు కలుగదు. అవి ప్రచార మాధ్యమాలైనందున కళాకారుల జీవితాలు నడివీధికెక్కాయి.
5. పూర్వం కళాకారుల బ్రతుకు తెరువుకు లోటుండేది కాదు. పిల్లలను కళాకారులుగా తీర్చిదిద్దాలనుకునేవారు. పెద్దల బాటలోనే పిల్లలు నడిచారు. కళాలారుల బిడ్డలు పొట్ట గడవని కళాకారులుగానే జీవించాలనేది లేదు. కూటి కొరకు కోటి విద్యలు ఒకనాటిమాట కూటి కొరకు కంప్యూటర్ విద్యలు నేటి మాట. కాబట్టే మార్పు జీవనానికి సహజం. ప్రగతి మార్పును కోరుకుంటుంది. పాతకొత్తల మేలు కలయిక సమన్వయ జీవనానికి పునాది. నిరక్ష్యరాస్యులైన జానపద కళాకారులు తమ పిల్లలు అక్షరాస్యులు కావాలని చదువు బాటవైపు పయనం సాగించాలని ప్రయత్నిస్తున్నారు. నిరక్షరాస్యులు కావటం వలన పిల్లలను తీర్చిదిద్దలేక పోతున్నారు.
6. గ్రామాలకు దూరంగా ఉండి ఇతరులతో సహజీవనం లేకపోవటం వలన వీరి జీవన విధానం కట్టుబాట్లు గ్రామీణులకు తెలియకుండా జీవించాలనే ప్రయత్నంలో కొన్ని అవకాశాలను పోగొట్టుకున్నారు. పిల్లలను బడిలో చేర్పించి వాళ్ళను 'చక్కనోళ్ళుగా' చేద్దామనే ఆలోచన కలిగింది.

(బుడ్గ జంగందర్శిని డా. ఎన్.ఆర్ వెంకటేశం)

7. జానపద కళలను ప్రోత్సహించటానికి మాన్యాలుండేవి. అందులో పండే ధాన్యాన్ని కళాకారుల కోసం

వ్యయం చేసేవారు. ఈ ఉమ్మడి మాన్యాలు రాజులతో అంతరించిపోయింది. నాగరిక సమాజం ఈ పద్ధతికి స్వస్తి పలికింది. కోతికి కూడ కోతిమాన్యాలుండేవి. ఈ కళాకారులు నేడు తినడానికి తిండి కట్టుకోడానికి బట్ట, ఉండటానికి ఇల్లు లేక దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారు. కళకోసం యాచించటం, అస్పృశ్యత, నిరక్షరాస్యత, దారిద్ర్యం, జనాదరణ లేకపోవటం, సమాజంలో వ్యక్తులుగానే కాదు కళాకారులుగానూ గౌరవం లేకపోవటం వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారు.

8. జానపద ప్రదర్శన కళాకారులు 6 గంటల పాటు చెక్క ఆభరణాలను, అట్టలను ధరించి, భరించి ముఖానికి రంగులు పులిమి చిందులు వేస్తూ ఆయా కులాలవారిని రంజిల్ల జేస్తూ వినోదాన్ని చేకూరుస్తున్నారు. కళకోసం కన్యాశుల్కం ఇచ్చి ఇద్దరు ముగ్గురు భార్యలను వివాహమాడటం, ఉమ్మడి వ్యవస్థగా / మేళాలుగా ఏర్పడి కళాప్రదర్శనలు చేస్తున్నారు. నేడు సమష్టి భావన పోయి వ్యష్టి కుటుంబాల ప్రాధాన్యం పెరిగింది.
9. సమైక్యతా భావంతో ఆటపాట నాటకాలు పండగలు వేడుకలు జరిగేవి. నేడు రాజకీయ దాడికి, సాంస్కృతీకరణకు లోబడి మారిపోతున్న సమాజంలో స్వార్థం చోటు చేసుకుంది.
10. భాగోతం ప్రదర్శిస్తే వర్షం కురుస్తుందని, ఊరికి, పంటలకు మంచిదని విశ్వసించేవారు. ఎల్లమ్మ ముఖం కడిగితే పంటలకు దీవెన అని భావించేవారు. నాగరిక సమాజంలో ఆచారాలు సంప్రదాయాలు, నమ్మకాలు సన్నగిల్లాయి.
11. జానపద కళలు ఆదిమ తత్త్వాన్ని కలిగిన కళలు, సౌందర్యం ఆనందం జానపద కళల ప్రయోజనం. కళాదృష్టి, సౌందర్య సృష్టి తద్వారా ఆనందానుభూతిని కలిగిస్తాయి.

   – (డా. తంగిరాల వెంకట సుబ్బారావు, డా. ఆర్.వి.ఎస్. సుందరం తెలుగు జానపద విజ్ఞానం సమాజం సంస్కృతి సాహిత్యం) (డా. జి.ఎస్,. మోహన్)
12. పిల్లలకు వీటి ప్రాధాన్యాన్ని తెలియచేయాలి. కథలన్నా కళలన్నా ఆసక్తి కనబరచాలి. కథలు చెప్పే అమ్మమ్మలు కరువయ్యారు. ముగ్గులు పెట్టే ముదితలు లేరు. పాటలు పాడే పడతులు లేరు. కళల మీద ఆసక్తిని పెంచుకోవాలి. పిల్లలకి హరీపోటర్ కథలు తెలుసు కాని పంచతంత్రం కథలు తెలియవు. టీవీలకు అంకితమై పోయిన బతుకుల వలన కళలు నిరాదరణకు గురయ్యాయి.
13. కళలు ప్రజలలో దేశభక్తిని, మతాన్ని ప్రచారం చేయటానికి, ఉద్యమస్ఫూర్తికి తోడ్పడుతుంది. వివిధ రకాల వ్యక్తుల గుణగణాల్ని సమస్యల్ని ఈ కళారూపాల ద్వారా ప్రచారం చేయవచ్చు. దాని వలన ప్రజలకు త్వరగా ఆకళింపు కలుగుతుంది. కుటుంబ సంక్షేమం గురించి, వైద్య సంబంధిత విషయాలను గురించి పొదుపు చేయటం గురించి జానపద కళల మూలంగా ప్రజలను విద్యావంతులను చేయటం జరుగుతుంది.

ప్రదర్శన కళల సంరక్షక పద్ధతులు :

- వినోదాన్ని విజ్ఞానాన్ని వికాసాన్ని కలిగించే జానపద కళలు ప్రజలను చైతన్యవంతులను చేయాలి.
- దారిద్ర్యం, అస్పృశ్యత, నిరక్షరాస్యత, అనారోగ్యం, అధిక జనాభా, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలనుండి విముక్తి కలిగించాలి.
- అక్షరాస్యులుగా మారాలి. కళలను సంరక్షించి సంస్కృతిని కాపాడాలి. పిల్లల విద్యాభివృద్ధికై ప్రభుత్వం గృహవసతిని ఆర్థిక సహాయాన్ని అందించాలి.
- పర్యాటక శాఖవారు తోలుబొమ్మలాటల వంటి వినోదాలను ఏర్పాటు చేయాలి. కథాగాన కళాప్రదర్శనలు మొదలైన కళారూపాలను ప్రోత్సహించాలి. ఉదా. గోల్కొండ రాజుల కథనం జానపదకళా ప్రదర్శన మూలంగా నిర్వహించవచ్చు.

- విద్యార్థులకు పాఠ్యాంశాలుగా జానపద కళలను పరిచయం చేసి వాటి వైశిష్ట్యాన్ని, జాతి సంస్కృతిని బోధించాలి. ప్రాచ్య కళలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- పాలకవర్గం ప్రదర్శన కళలను రాజకీయ హంగుల కోసం కాక సామాజిక విలువల కోసం, సమైక్యత కోసం ఆదరించాలి.
- వృద్ధ కళాకారులకు పింఛన్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వంటివి అమలు జరపాలి.
- వాతావరణ కాలుష్యానికి దారితీసే గణేశ ఉత్సవాలకు బదులుగా కళాకారుల జీవనానికి దారి చూపే ఉత్సవంగా మారాలి.
- కళాకారుల చేవృత్తులను ప్రోత్సహించి విక్రయాలను పెంచాలి. రైతు బజారుల్లో ఆ పరికరాలు, గృహోపకరణాలు అందరికీ అందుబాటులో ప్రామాణిక ధరలలో లభ్యమయ్యేట్టు ప్రభుత్వం ప్రోత్సహించాలి.
- పట్టణాలు పెరిగిపోతూ, సమైక్యత సన్నగిల్లుతూ, కళారూపాలు జనజీవనానికి దూరమవుతూ అంతరించిపోయే ప్రమాదం ఏర్పడుతుంది.
- విద్యా విధానంలో మార్పురావాలి. జాతీయ భావం, దేశాభిమానం, హృదయ సంపన్నం కావాలి.
- అన్ని నృత్యాలకు మూలం జానపద నృత్యం. పాశ్చాత్య సంగీతానికి నాట్యానికి మోజు చూపటం కన్నా మన కళలను మనం గౌరవించి సుసంపన్నం చేసుకోవటం ఉత్తమం. అతి ప్రాచీనమైన నాట్యకళను కాదని వేలం వెర్రిగా పాశ్చాత్య నాగరికతను అనుసరించటం హేయమైనది. కళలను ప్రోత్సహించాలి.
- వస్త్రధారణ, ఆభరణాలు.... వంటి అనేక విషయాలలో మన సంస్కృతిని మనమే కాపాడుకోవాలి. కళ కళకోసమే అనే సిద్ధాంతం – Art for art sake మరుగున పడిపోయింది. ఆధునిక కాలంలో సౌందర్య దృష్టి కొరవడి ఉపయోగ దృష్టి అధికమయ్యింది, use and throw – పనికి వచ్చిందే అందమైనది అనే సంస్కృతి ఏర్పడింది. ఇది యూరప్ సంస్కృతి. మన భారతదేశం ఆత్మరహిత విద్యకు దూరంగా ఉంది.
- జాతి జీవనంలో, విద్యారంగంలో, మానవ పరిణామ వికాసంలో కళల స్థానాన్ని ప్రాధాన్యాన్ని గ్రహించాలి.
- జాతీయ విద్యను పెంపొందించాలి. సౌందర్య(దృష్టి), పునరుజ్జీవనం వైపు దృష్టిని కేంద్రీకరించాలి.
- భారతీయ ఆత్మను కళల మూలంగా మేల్కొలిపి ప్రాచీన సంస్కృతిని, భారతీయ జాతిని, భారతీయ దృష్టిని భారతీయ ముద్రను రూపొందించుకోవాలి.
- ఆంగ్ల బోధనలు, వ్యాపార లక్ష్యాలు, పాశ్చాత్య అనుకరణ పద్ధతులకు స్వస్తి వచనం పలకాలి. మన భారతీయ భాషలకు ప్రాధాన్యం ఇచ్చి ఇతర భాషలను నేర్చుకోవటం తప్పుకాదు. సంపూర్ణంగా పాశ్చాత్య భాషలకు మక్కువ చూపటం తప్పు. విద్యాబోధన మనదై ఉండాలి. విద్యా ప్రణాళిక మనం రూపొందించుకున్నదై ఉండాలి. పిల్లలపై అధిక భారాన్ని మోపకుండా వినోదాత్మక కళలపై ఆసక్తిని చిగురింపజేయాలి. కళల జాతీయ విలువలను గుర్తించాలి.

– డా. జి. అరుణకుమారి, తెలుగుశాఖ
(హైదరాబాదు విశ్వవిద్యాలయం)

ఉపయుక్త గ్రంథసూచి :

1. డా. కె.ముత్యం - నేను చిందుల ఎల్లమ్మను.
2. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి - యక్షగానం జానపద రూపకం.
3. డా. ఎన్.ఆర్.వెంకటేశం - బుడ్గ జంగందర్శని.
4. డా. తంగిరాల వెంకట సుబ్బారావు, డా. ఆర్.వి.ఎస్.సుందరం - తెలుగు జానపద విజ్ఞానం సమాజం సంస్కృతి సాహిత్యం.
5. డా. జి.ఎస్.మోహన్ - జానపద విజ్ఞానం.